సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి. మార్కెట్‌కు 437 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4.50 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

39.7°/23.1°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలతో వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

అనంతపురం రేంజ్ డీఐజీగా అమ్మిరెడ్డి



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ డీఐజీగా ఆర్.ఎస్. అమ్మిరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ డీఐజీగా పనిచేస్తున్న ఎం.రవిప్రకాష్ సెబ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2009 బ్యాచ్‌కు చెందిన అమ్మిరెడ్డి ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో అడ్మిన్‌గా పని చేస్తున్నారు. గతంలో గుంటూరు ఎస్పీగా పనిచేశారు.

జిల్లా నూతన ఎస్పీగా మాధవరెడ్డి



ఎస్.వి మాధవ రెడ్డి

కొత్తచెరువు: జిల్లా నూతన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ)గా ఎస్.వి. మాధవరెడ్డిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎస్పీగా పని చేస్తున్న రాహుల్‌దేవ్ సింగ్‌ను విజయవాడ రైల్వే ఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎస్వి మాధవరెడ్డిని నియమించింది. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎస్.వి. మాధవరెడ్డి 2010 గ్రూప్–1 ఆఫీసర్‌గా సెలక్ట్ అయ్యారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో పనిచేశారు. 2018లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలు, విజయవాడ ట్రాఫిక్ విభాగంలో పనిచేశారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌లో (ఏడీసీ), గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. కొన్ని రోజులుగా వీఆర్‌లో ఉన్న ఆయన్ను ప్రభుత్వం తాజా బదిలీల్లో జిల్లా ఎస్పీగా పంపుతూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా కంచి శ్రీనివాసరావు నియమితులయ్యారు. అనంతపురం ఎస్పీగా ఉన్న ఫక్కీరప్పను ప్రభుత్వం సీఐడీ ఎస్పీగా బదిలీ చేసింది.

98-డీఎస్సీ అభ్యర్థులు 536 మంది

- 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ ద్వారా నియామకం



రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 536 మంది 1998–డీఎస్సీ అభ్యర్థులను గుర్తించారు. మొత్తం 570 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను గతంలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరిలో 60 ఏళ్ల పైబడిన వారు 34 మంది ఉన్నారు. దీంతో తక్కిన 536 మంది అభ్యర్థులకు పోస్టులు ఇచ్చే అవకాశం ఉంది. మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఆధారంగా ఎస్జీటీలుగా నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలు శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. 10న జాబితాకు జిల్లా ఎంపిక కమిటీ ఆమోదం తెలుపుతుందని, 11న అభ్యర్థులకు కౌన్సెలింగ్ సమయం ప్రకటిస్తామన్నారు. 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ ద్వారా నియామక ఉత్తర్వులు అందజేస్తామని వెల్లడించారు.

కీచక తమ్ముళ్లు



- చిన్నారులపై అఘాయిత్యాల్లో ఆరితేరిన వైనం
- హిందూపురంలో అత్యధికంగా 36 మందిపై కేసులు
- జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో 86 పోక్సో కేసులు
- నిందితుల్లో ఎక్కువ మంది టీడీపీ కార్యకర్తలే

సాక్షి, పుట్టపర్తి: 'అమ్మాయి కనిపిస్తే కడుపైనా చేయాలి... ముద్దైనా పెట్టాలి' హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ఓ సభలో చెప్పిన మాటలివి. తెలుగు తమ్ముళ్లు ఆయన మాట తూచా తప్పకుండా పాటిస్తున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ బరితెగించి తిరిగిన వాళ్లు ఇప్పుడూ అదే పంథాలో వెళ్తున్నారు. కీచకుల్లా మారి అభంశుభం తెలియని బాలికలపై అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. నాగరిక కాలంలోనూ అనాగరికంగా ప్రవర్తిస్తున్నారు. జీవితాలను బుగ్గిపాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఫలితంగా జిల్లాలో పోక్సో కేసుల సంఖ్య పెరిగిపోతోంది. మద్యం మత్తులో కొందరు.. సైకోలుగా మారి ఇంకొందరు.. ప్రతీకార వాంఛతో మరి కొందరు.. పంతం నెగ్గించుకోవాలనే తపన.. ఇలా ఏదో కారణంతో బాలికలపై అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఏడాది వ్యవధిలో మొత్తం 86 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇందులో సగానికి పైగా కేసుల్లో నిందితులుగా టీడీపీ వర్గీయులే ఉన్నారు. 44 కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారు కాగా.. మిగతా 42 కేసులు విచారణలో ఉన్నాయి.

హిందూపురంలో అత్యధికం

ఏడాది వ్యవధిలో జిల్లాలో మొత్తం 86 పోక్సో కేసులు నమోదు కాగా.. హిందూపురంలో అత్యధికంగా 36 కేసులు నమోదు కావడం విశేషం. అదేవిధంగా ధర్మవరంలో 20, కదిరిలో 10, పుట్టపర్తిలో 10, పెనుకొండలో 8, ఇతర ప్రాంతాల్లో రెండు కేసులు ఉన్నాయి. ఇందులో 44 కేసులు విచారణ పూర్తయ్యాయి. మరో 42 కేసులు విచారణలో ఉన్నాయి. మొత్తం కేసుల్లో 2022 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 74 ఉండగా.. 2023 ఆరంభం నుంచి ఏప్రిల్ 1వ తేదీ నాటికి మరో 12 కేసులు తేలాయి.



పరిటాల సునీతతో బీరే అంజినేయులు

వృత్తంలోని వ్యక్తి బీరే ఆంజనేయులు. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలంలో ఓ దినపత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు. పరిటాల శ్రీరామ్‌కు అత్యంత సన్నిహితుడు. టీడీపీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు. 2023 ఫిబ్రవరి 26న కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేశాడు. బాధిత బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కనగానపల్లి పోలీసులు బీరే ఆంజనేయులుపై పోక్సో కేసు నమోదు చేశారు.



నారా లోకేష్‌తో ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి రాళ్లపల్లి ఇంతియాజ్. కదిరి నియోజకవర్గ నల్లచెరువు ఐటీడీపీ మండల కన్వీనర్. 2022 అక్టోబరు 5న తనకల్లు మండలం బొంతలపల్లికి చెందిన సంధ్యారాణి(17)పై అత్యాచారం చేశాడు. మనస్తాపానికి గురైన యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో రాళ్లపల్లి ఇంతియాజ్ అకృత్యాలు వివరించింది. కదిరి టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌కు ఇంతియాజ్ అత్యంత సన్నిహితుడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చట్టాలు రూపొందించింది. ప్రత్యేకంగా 'దిశ' స్టేషన్లను ఏర్పాటు చేసింది. పోలీసు శాఖ మహిళలపై అత్యాచారాలు, దాడుల నిరోధానికి కృషి చేస్తోంది. 'దిశ' యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు క్షణాల్లోనే రక్షణ కల్పిస్తోంది. ఎక్కడైనా అత్యాచారం జరిగితే వెంటనే నిందితున్ని అరెస్టు చేయడంతో పాటు శిక్ష పడేలా చూస్తున్నాం. దాడులు, వేధింపులకు గురయ్యే వారు పోలీసులకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తారు. పోక్సో కేసుల్లో ఇప్పటికే పలువురికి శిక్ష పడింది.

– కేవీఆర్‌కే ప్రసాద్, ఏఎస్పీ

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి అర్బన్: నిరాదరణకు గురైన బాలలను ఆదుకునే లక్ష్యంతో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పథకానికి అర్హులైన వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తామన్నారు.

అర్హులు ఎవరంటే...

అనాథలు. తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులకు దూరమైన వారు. తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు. విడాకులు తీసుకున్న వారి పిల్లలు. నిరాదరణకు గురైన మహిళ పిల్లలు. ప్రాణాంతక వ్యాధితో బాధ పడుతున్న వారి పిల్లలు. పిల్లలను పెంచలేని నిస్సహాయ తల్లిదండ్రుల పిల్లలు ఈ పథకానికి అర్హులు. వయస్సు 0–18 ఏళ్ల లోపు ఉండాలి. అర్హులకు ఆర్థిక భరోసాతో పాటు విద్య, వైద్యం, అభివృద్ధి అవసరాలు తీర్చడానికి 'మిషన్ వాత్సల్య స్కాలర్ షిప్పు' అందజేస్తారు.

- ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరి పిల్లలకు అవకాశం ఉంటుంది. అర్హులు ఆయా ప్రాంతాల్లోని గ్రామ మహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను సంప్రదిస్తే వారే ఆన్‌లైన్‌లో వివరాలు పంపుతారు. అనంతరం పిల్లల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని దరఖాస్తులు పూర్తి చేసి ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమర్పిస్తారు.

కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు

బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లి ఆధార్ కార్డు, తండ్రి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల్లో ఎవరైనా మరణించి ఉంటే వారి మరణ ధ్రువీకరణపత్రం. గార్డియన్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బాలుడి/బాలిక వ్యక్తి గత బ్యాంకు అకౌంటు, తల్లి/తండ్రి, లేదా సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంటు జిరాక్స్ పత్రం.

వసూళ్లు ఫుల్..తనిఖీలు నిల్

- ఫుడ్ సేఫ్టీ అధికారుల చేతివాటం
- కేసులు రాయకుండా ఉండేందుకు డబ్బు డిమాండ్
- 'సారు' పేరుతో సాగుతున్న భారీ దందా



- పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లిలో ఓ వ్యాపారి రైతులతో పాలు సేకరించి విక్రయిస్తుంటాడు. అతని వద్దకు వెళ్లిన ఆహార భద్రతా అధికారులు 'పాలలో యూరియా మిక్స్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. రిపోర్టు వస్తే ఇబ్బందులు పడుతావ్. ఓ రూ.50 వేలు ఇస్తే నీ జోలికి రాం' అన్నారు. మరుసటి రోజు డబ్బుల కోసం వెళ్లిన ఫుడ్ సేఫ్టీ ఉద్యోగికి ఓ మీడియా ప్రతినిధి కనిపించగా, అక్కడి నుంచి జారుకున్నాడు.
- గోరంట్లలో ఓ హోటల్ వద్దకు వెళ్లిన కొందరు 'మేం ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబితే వచ్చాం. రూ.20 వేలు తీసుకురావాలని అధికారులు పంపారు. లేదంటే అధికారులు ఇక్కడికి వచ్చి తనిఖీలు చేసి జరిమానా విధిస్తారు' అని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన దుకాణం యజమానికి వారు అడిగినంత ఇచ్చుకున్నాడు.

సాక్షి, పుట్టపర్తి: 'ఫుడ్ సేఫ్టీ' అధికారుల దెబ్బకు చిన్న చిన్న దుకాణదారులు, కొత్తగా ఏర్పాటు చేసుకున్న హోటళ్లు, సూపర్ మార్కెట్ నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా నేరుగా దుకాణదారుల వద్దకు వెళ్లి జరిమానా పేరుతో వసూళ్లకు దిగడంతో చిల్లర కొట్టు దుకాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. అంతేకాకుండా మిల్క్ డెయిరీలు, గ్రామాల్లో రైతుల నుంచి పాలు సేకరించి విక్రయించే వారిపై కూడా జిల్లా అధికారులు ముడుపులు తీసుకుంటున్నారు. మండలాల వారీగా ఏజెంట్లను పెట్టుకుని వసూళ్లు చేస్తున్నారు.

హిందూపురం, పెనుకొండలోనూ..

ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రతా) అధికారులు డివిజన్ల వారీగా విభజన చేసుకుని విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆహారం కల్తీ కాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ముందుగా దుకాణదారులు, సూపర్‌మార్కెట్ నిర్వాహకులు, హోటళ్ల యజమానులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అయితే అధికారులు మాత్రం అలాంటి కార్యక్రమాలేవీ నిర్వహించకుండానే... నేరుగా వెళ్లి దందాకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. పెనుకొండ, హిందూపురంలో ఏజెంట్ల ద్వారా వసూళ్లు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. అంగట్లో చాక్లెట్ల నుంచి హోటళ్లలో బిర్యానీల వరకు 'ఫుడ్ ఇన్‌స్పెక్టర్' పేరుతో డబ్బులు ఇవ్వకుండా తీసుకుంటున్నారు.

శ్యాంపిళ్లు అంతంత మాత్రమే

ఆహార భద్రత ప్రమాణాలను పరిశీలించాల్సిన అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. వసూళ్లు చేయడం, జేబులు నింపుకొనే పనిలోనే పెట్టుకున్నారు. హోటళ్లలో ఆహారం తనిఖీ చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఫలితంగా హోటళ్లలో కల్తీ రాజ్యమేలుతోంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కల్తీ ఆహారం తిని చిన్నారులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూశాయి. అలాంటి పాఠశాలల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఆహార భద్రతా అధికారుల పనితీరు (ఏడాది వ్యవధిలో)	
సేకరించిన శ్యాంపిళ్లు	98
ఫలితం రానివి	08
లైసెన్సు ఇచ్చిన దుకాణాలు	348
లైసెన్సుల ద్వారా ఆదాయం రూ.13,30,900	

సిబ్బంది కొరత వల్లే



మా విభాగంలో సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఫలితంగా అన్ని ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు చేయలేకపోతున్నాం. అయితే నేరుగా వచ్చి ఫిర్యాదు చేసినా.. ఫోన్‌లో సమాచారం ఇచ్చినా.. వెంటనే వెళ్లి ఆహార భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నాం. మా సిబ్బంది వసూళ్ల గురించి నా దృష్టికి రాలేదు. ఫిర్యాదు వస్తే విచారణ చేసి చర్యలకు సిఫారసు చేస్తా.

– రామచందర్, జిల్లా ఆహార భద్రతా అధికారి

పాలకమండళ్ల భర్తీకి కసరత్తు

- సమర్థులైన ప్రొఫెసర్ల జాబితా సిద్ధం
- 15 మంది సభ్యులతో పాలక మండలి
- ఇందులో ఎక్స్ అఫిషియో సభ్యులు ఐదుగురు
- తక్కిన పది మంది వివిధ రంగాల్లో నిపుణులు
- ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ)లో పలువురు ఆసక్తి



ఎస్కేయూ ముఖద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ), అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూఏ) పాలకమండళ్ల సభ్యుల నియామకానికి కసరత్తు జరుగుతోంది. ఇది వరకు ఉన్న పాలకమండలి సభ్యుల మూడేళ్ల గడువు గత వారమే పూర్తయ్యింది. ఒక్కో పాలకమండలిలో మొత్తం 15 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఐదుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, తక్కిన 10 మంది వివిధ రంగాల్లోని నిపుణులు ఉంటారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ, కళాశాల విద్య స్పెషల్ కమిషనర్, డిప్యూటీ ఫైనాన్స్ అడ్వైజర్, ఉన్నత విద్యామండలి చైర్మన్, రెక్టార్ పాలకమండలిలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. తక్కిన 10 మందిలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల లెక్చరర్, ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన నలుగురు ప్రముఖులు, పాలకమండలి సెక్రెటరీగా రిజిస్ట్రార్ ఉంటారు. పాలకమండలి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తారు.

సమగ్ర వివరాల సేకరణ

ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, ఒక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల లెక్చరర్లలో ఎవరు సమర్థులు అనే అంశంపై ఇప్పటికే సమగ్ర వివరాలను ఎస్కే యూనివర్సిటీ ఉన్నతాధికారులు సేకరించారు. వీటిని ఉన్నత విద్యామండలికి పంపారు. సామాజిక సమతూకం ఉండే రీతిలో వివరాలు పంపాలని ఉన్నత విద్యామండలి నిర్దేశించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి ప్రొఫెసర్లు 50 శాతం పైగా ఉండాలని పేర్కొన్న నేపథ్యంలో ఆ మేరకు వివరాలు పంపారు. ఇందులోనూ మహిళలకు సింహభాగం కేటాయించనున్నారు. ఎస్కేయూ క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణకుమారి ఇటీవలే నియమితులయ్యారు. ప్రిన్సిపాల్ కోటాలో ప్రొఫెసర్ కృష్ణకుమారి పేరును పాలకమండలి సభ్యుల జాబితాలో చేర్చినట్లు తెలిసింది. జేఎన్‌టీయూఏ పాలక మండలి సభ్యుల నియామకంపై పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. పాలకమండలి సభ్యుల స్థానాల కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ)లో పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రశాంతి నిలయం/ధర్మవరం అర్బన్/బత్తలపల్లి: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. శనివారం 125 కేంద్రాల్లో ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. 22,251 మందికి గాను 22,046 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ బసంత్ కుమార్ ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బత్తలపల్లి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు గురించి ఆరా తీశారు. ముఖ్యంగా వెలుతురు సరిగా ఉండేలా చూడటంతో పాటు, తాగునీటి సదుపాయం తప్పక కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష



కార్తీక్‌కుమార్‌రెడ్డి

తనకల్లు: నడిపించే నాన్న భౌతికంగా దూరమయ్యాడు. ఊరడించే అమ్మ ఓ మూల సొమ్మసిల్లి పడి ఉంది. ఫోన్ చేస్తే బంధువులంతా పొగిలి పొగిలి ఏడుస్తున్నారు. ఎవరెవరో వచ్చి భుజం తట్టి వెళ్తున్నారు. ఇప్పుడు నాన్న దగ్గరకు వెళ్లిపోవాలా... బతుకుబాట దిద్దుకోవాలా... నిండా పదహారేళ్లు లేని ఆ బాలుడి మనసులో ఎన్నో ప్రశ్నలు..కానీ తండ్రి చెప్పిన మాట మేరకు పరీక్ష హాలు బాట పట్టాడు. కీలకమైన బతుకు పరీక్ష రాశాడు. వివరాల్లోకి వెళితే...తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి శుక్రవారం రాత్రి నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన చిన్న కుమారుడు కార్తీక్‌కుమార్‌రెడ్డి మదనపల్లిలోని అమ్మమ్మగారింట ఉంటూ చదువుకునేవాడు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తండ్రి మరణవార్త తెలియగానే తల్లడిల్లిపోయాడు. వెంటనే కనసానివారిపల్లికి వెళ్లాలనుకున్నాడు. కానీ 'బాగా చదువుకో నాన్న...అందుకే నిన్ను అమ్మమ్మ వాళ్ల ఇంట్లో ఉంచాం' అన్న తండ్రి మాటలు గుర్తు తెచ్చుకుని ఆగిపోయాడు. శనివారం ఉదయం మదనపల్లెలోని బాపూజీ మున్సిపల్ స్కూల్ సెంటర్‌లో ఇంగ్లిష్ పరీక్ష రాశాడు. ఆ వెంటనే 70 కి.మీ దూరంలోని స్వగ్రామమైన కనసానివారిపల్లికి చేరుకొని తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

క్లుప్తంగా

జిల్లా చీఫ్ కోచ్‌గా జగన్నాథరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా జగన్నాథరెడ్డి నియమితులయ్యారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు సమక్షంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న వెంకటరమణను హాకీ కోచ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో జగన్నాథరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఇప్పటి వరకూ ఆయన పనిచేసిన శ్రీసత్యసాయి జిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

14 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం అర్బన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం ఉదయం ధర్మవరంలోని ప్రియాంకనగర్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఐచర్ వాహనంలోకి లోడు చేస్తున్న 14 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం విలువ దాదాపు రూ.3 లక్షలకుపైగా ఉంటుంది. ఐచర్‌తో పాటు బియ్యం తరలించుకుని వచ్చిన బొలెరో వాహనం, మూడు ఆటోలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఈ రవీంద్ర, ఆర్ఐ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లాస్థాయి సీనియర్ హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ధర్మవరం వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడే జిల్లా జట్టును ఈ నెల 10న ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1994, జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలి. పదో తరగతి మార్కులిస్టు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలి.

విపత్తును ఎదుర్కొనేలా..

- వేసవిలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- అందుబాటులో అధునాతన పరికరాలు, వాహనాలు
- పక్కా ప్రణాళికతో ఉన్నామంటున్న అగ్నిమాపక శాఖ అధికారులు

పుట్టపర్తి టౌన్: అగ్నిదేవుడు చెలరేగే కాలం.. అన్నివిధాలా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం కావడంతో జిల్లాలో అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. అధునాతన పరికరాలు, వాహనాలు సమకూర్చుకుని పక్కా ప్రణాళికతో ఉన్నామని అగ్రిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కొత్తవాటికి ప్రతిపాదనలు

రోజురోజుకూ ఎండలు ముదిరిపోతున్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడ్డివాములు, ఉద్యాన తోటలు, అటవీ ప్రాంతాలు దగ్ధమవుతున్నాయి. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాల నివారణకు జిల్లా అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, మడకశిర అగ్నిమాపక సేవల శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలో ఆరుగురు ఫైర్ అధికారులతో పాటు 100 మంది ఫైర్ ఫైటర్లు, 24 మంది హోం గార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, ఇంజన్లను సిద్ధంగా ఉంచుకున్నారు. అలాగే కాలం చెల్లిన ఇంజన్ల స్థానంలో కొత్తవాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనాలు పంపారు.

అడ్వాన్స్ వాటర్ టెండర్ ఫైర్ ఇంజన్

అధునాతన ఫైర్ వాటర్ టెండర్ వాహనం ఇది. 4,500 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంక్ ఉంటుంది. సాధారణంగా వాటర్ ట్రేడింగ్ ఇంజన్ కింద నుంచి నీటిని అత్యధిక పీడనంతో పిచికారీ చేస్తుంటారు. ఇందులో కార్బన్‌డయాక్సైడ్ మిళితమై ఉంటుంది.



టమాట పంటలో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

వాటర్ టెండర్ ఫైర్ ఇంజన్



దీనిని ఆపరేట్ చేయడానికి ప్రత్యేకంగా ఫైర్ ఫైటర్ ఉంటాడు. 4,500 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంక్ ఉంటుంది. నీళ్లను పిచికారీ చేయాలన్న, నీటిని ట్యాంక్‌లోకి నింపాలన్న దీనిని ఉపయోగిస్తారు. నీట మునిగిన వాహనాలను సైతం వెలికి తీసేందుకు ఈ వాహనం దోహదపడుతుంది. దీనిని ఎలక్ట్రానిక్ రిమోట్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు.

మిస్ట్ జీప్



దీనినే మినీ ఫైరింజన్ అని కూడా పిలుస్తుంటారు. 200 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంక్ ఉంటుంది. వాహనానికి అమర్చిన మిస్ట్ గన్ ద్వారా నీటిని పిచికారీ చేస్తున్న సమయంలో నీటి బిందువులు అనేక మిల్లీ మైక్రాన్ అణువులుగా విడిపోయి మంటలు అదుపు చేస్తాయి.

ఫైర్ బుల్లెట్ బైక్



ఇరుకైన వీధుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అక్కడకు చేరుకునేందుకు వీలుగా రూపొందించిన ద్విచక్ర వాహనం ఇది. పది లీటర్ల ఫోంతో కూడిన రెండు నీళ్ల ట్యాంక్‌లు కలిగి ఉంటుంది.

సెలవులు రద్దు చేశాం



ఎండలు ముదిరిపోతున్న ప్రస్తుత తరుణంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సిబ్బంది సెలవులు రద్దు చేశాం. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప సెలవులు ఇవ్వడం లేదు. ప్రమాదాల నివారణకు పక్కా ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నాం. అగ్ని ప్రమాదాల నివారణపై ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు ప్రజలను చైతన్య పరిచేందుకు వారోత్సవాలు నిర్వహించనున్నాం.

- శంకర్‌ప్రసాద్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

ఫాదర్ ఫెర్రర్ జయంతికి ఏర్పాట్లు

బత్తలపల్లి: ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ మేరకు ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద శనివారం తెలిపారు. బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్‌ను అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం సాయంత్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్‌లు ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు అనంతరం సందేశాలు వినిపిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో ఇండియా ఫర్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన 4,316 హుండీలను లెక్కించి కొత్త హుండీలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కోడేకండ్లలో ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ పర్యటించనున్నారు. హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం ఈదుల ముష్టూరు గ్రామాన్ని సందర్శించి హుండీ లెక్కింపును పర్యవేక్షించనున్నారు. వివిధ గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు.



బత్తలపల్లిలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్

కేబుల్ దొంగల అరెస్ట్

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతంలో వరుస కేబుల్ చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం ఎస్ఐ టీవీ శ్రీహర్ష వెల్లడించారు. అనంతపురంలోని నాయక్‌నగర్ నివాసి మామిళ్ల రామకృష్ణ, బత్తలపల్లి మండలం మాల్యవంతం నివాసి సాకే అశోక్ ఇద్దరూ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు మాల్యవంతంలోని రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు, కేబుల్ వైర్లు అపహరించుకెళ్లి, కర్ణాటక ప్రాంతంలో విక్రయించి, సొమ్ము చేసుకునేవారు.



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో నిఘా పెంచిన పోలీసులు పక్కా ఆధారాలతో శనివారం నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి కేబుల్ వైర్లు, ఐదు విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

కదిరి టౌన్: ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన రమణమ్మ(76) కొంత కాలంగా మతిస్థిమితం లేక గ్రామాల్లో తిరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట నిద్రించిన ఆమె... కాసేపటికి లేచి నడుచుకుంటూ వెళ్లింది. గ్రామ శివారులోని పట్టాలు దాటుతుండగా రైలు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం ఉదయం పట్టాలపై ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ రహమాన్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

సోమందేపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన నాగిరెడ్డి (58) కొంత కాలంగా మతి స్థిమితం లేక గ్రామాల్లో తిరుగుతుండేవాడు. శనివారం ఉదయం బ్రాహ్మణపల్లి వద్ద రైలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల పీజీ విద్యార్థిని నర్మద హాస్టల్‌లో శనివారం ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు..నర్మదా హాస్టల్ రూంలో ముగ్గురు విద్యార్థినులు ఉంటున్నారు. ఇద్దరికి మాత్రమే మంచాలు (బెడ్లు) ఉన్నాయి. మంచం లేని కారణంగా ఇద్దరు విద్యార్థినులు ఘర్షణ పడ్డారు. ఇదే సమయంలో వేరే గదిలోకి వెళ్లి అక్కడే ఉన్న ఫ్యాన్‌కు చున్నీ తగిలిస్తుండడగా, తోటి విద్యార్థినులు గమనించి నివారించారు. అంతలోనే ఉన్నతాధికారులు కలగజేసుకొని ఇద్దరినీ ఒకే గదిలో ఉంచకుండా చెరో గది కేటాయించి, లగేజీ మార్పించారు. ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులు వచ్చి వారికి నచ్చజెప్పి వెళ్లిపోయారు.విద్యార్థినులు మంచంలేదని ఘర్షణపడి ప్రాణాలు తీసుకునే వరకూ రావడంపై చర్చనీయాంశమైంది.

అలరించిన జార్ఖండ్ కళాకారులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన జార్ఖండ్ భక్తులు శనివారం చౌ నృత్య రూపకాన్ని ప్రదర్శించి అలరించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత భగవద్గీతలోని 12వ అధ్యాయాన్ని, సత్యసాయి చాలీసాను పఠించారు. సాయంత్రం జార్ఖండ్‌లోని సారికేళి చౌ నాట్య అకాడమీకి చెందిన కళాకారులు నృత్యరూపకంతో ఆకట్టుకున్నారు.



నృత్య రూపకంలోని ఓ సన్నివేశం

మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ సీఈఓ

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవిని జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, రాజవంశీకుడు రంగప్పరాజు, ఆపదమిత్ర వలంటీర్ పరమేష్, దేవదాయశాఖ సిబ్బంది, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి శేషవస్త్రాలను అందుకుంటున్న జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి దంపతులు

వివాహిత బలవన్మరణం

గుంతకల్లు రూరల్: కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచర్ల గ్రామానికి చెందిన సుంకన్న, సుంకమ్మ దంపతుల కుమారుడు రంగస్వామికి ఏడేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి లక్ష్మి (27)తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భర్తతో పాటు అత్తమామల వేధింపులు పెరిగిపోవడంతో లక్ష్మి పూర్తిగా విసిగిపోయింది. శుక్రవారం వేధింపులు తాళలేక క్రిమి సంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక శనివారం తెల్లవారుజాము 3 గంటలకు ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

బ్లేడుతో గొంతుకోసుకుని యువతి మృతి



షబ్బు (ఫైల్)

గార్లదిన్నె: మానసిక స్థితి సరిగా లేని ఓ యువతి బ్లేడుతో గొంతు కోసుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన ఖాజాహుస్సేన్ కుమార్తె షేక్ షబ్బు (27) కొంత కాలంగా మానసిక స్థిమితం సరిగా లేక బాధపడుతోంది. కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలోకి వెళ్లిన షబ్బు అక్కడున్న బ్లేడ్ తీసుకుని గొంతు కోసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

నెత్తురోడిన రహదారులు









కళ్యాణదుర్గం: సతీష్, నందు (ఫైల్), ఉరవకొండ: రాయంపల్లి వద్ద మృతి చెందిన గంగన్న (ఫైల్) సర్వజనాస్పత్రిలో క్షతగ్రాతులను పరామర్శిస్తున్న విశ్వ

- వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఆత్మకూరు/కళ్యాణదుర్గం: అతి వేగం... నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలిగొంది. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు యువకులు, ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు...

కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన సతీష్ (25) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం అనంతపురంలోని మార్కెట్ యార్డులో జరిగే పొట్టేళ్ల సంతకు జీవాలను తరలించేందుకు సతీష్ ఆటోను అదే గ్రామానికి చెందిన వ్యాపారులు శ్రీనివాసులు, నందు, ఓబులేసు అద్దెకు మాట్లాడుకుని బయలుదేరారు. ఆత్మకూరు వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఆటో డ్రైవర్ సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. శరీరభాగాలు తునాతునకలై ఎనిమిది పొట్టేళ్లు మృతి చెందాయి. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాసులు, నందు, ఓబులేష్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను గమనించి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నందు (18)ని కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



ఆత్మకూరు: ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో

గోళ్లలో విషాదఛాయలు

గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారనే వార్త తెలియగానే గోళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని విలపించారు. కాగా, పది రోజులుగా గ్రామంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో ఓ యువతి ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు గుండె పోటుతో, మరొకరు వృద్ధాప్యంతో మృతి చెందారు. తాజాగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామానికి ఏదో అరిష్టం దాపురించిందనే అపోహలు వ్యాప్తి చెందాయి. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు లోనయ్యారు.

ఆటో బోల్తా..

ఉరవకొండ: విడపనకల్లు మండలం పాల్తూరులో మిర్చి పంట తొలగించేందుకు శనివారం ఉదయం వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామం నుంచి 16 మంది కూలీలతో బయలుదేరిన ఆటో ఉరవకొండ సమీపంలోని రాయపల్లి వద్దకు చేరుకోగానే బోల్తాపడింది. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటనలో పీసీ ప్యాపిలికి చెందిన గంగన్న (55) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కుమారి, గంగమ్మ, మల్లమ్మ, ఇంద్రమ్మ, నారాయణమ్మ, సునీత, గౌరిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా తొలుత ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సర్వజనాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పీసీ ప్యాపిలి నాయకులు కృష్ణ, భీమప్ప, వీరా, రమేష్ ఉన్నారు.